ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల వివరాలు		
ఎంపిపి ఎన్నిక		
మండలం	గెలిచిన అభ్యర్థి	మద్దతు పార్టీ
రామగిరి	వాయిదా	...
గాండ్లపెంట	వాయిదా	...
రొద్దం	నాగమ్మ	వైసిపి
కణేకల్లు	హెచ్.వండ్రయ్య	వైసిపి
కంబదూరు	లక్ష్మీదేవి	వైసిపి
వైస్ ఎంపిపి ఎన్నిక		
మండలం	గెలిచిన అభ్యర్థి	మద్దతు పార్టీ
ఉరవకొండ-2	ఈడిగ ప్రసాద్	వైసిపి
యల్లనూరు	పి.రమాదేవి	వైసిపి
పెద్దపప్పూరు	ఎం.నాగవేణి	వైసిపి
రాయదుర్గం	అరుణ్‌కుమార్	వైసిపి

అనంత ప్రశాంతం.. సత్యసాయి ఉద్రిక్తం..!

- రామగిరి, గాండ్లపెంట ఎంపిపి ఎన్నిక వాయిదా
- పెనుకొండలో రామగిరి ఎంపిపి ఎన్నిక రచ్చ
- సజావుగా కణేకల్లు, కంబదూరు, రొద్దం ఎన్నిక
- వైస్ ఎంపిపి, ఉపసర్పంచి ఎన్నికలు ఏకగ్రీవం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
ప్రజాశక్తి జిల్లా యంత్రాంగం

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఉప ఎన్నికలు గురువారం జరిగాయి. ఐదు ఎంపిపి, నాలుగు వైస్ఎంపిపి స్థానాలకు సంబంధించి ఎన్నికలను ఎన్నికల అధికారులు నిర్వహించారు. ఇందులో శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని రామగిరి, గాండ్లపెంట ఎంపిపి ఎన్నిక వాయిదా పడింది. ఇవి మినహా అనంతపురం జిల్లాలో కణేకల్లు, కంబదూరు శ్రీసత్యసాయి జిల్లా రొద్దం ఎంపిపి ఎన్నికలు సజావుగా జరిగాయి. వైస్ ఎంపిపిలకు సంబంధించి అనంతపురం జిల్లా ఉరవకొండ-2, యల్లనూరు, పెద్దపప్పూరు, రాయదుర్గంలో నిర్వహించిన ఎన్నికల్లో వైసిపి మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపిపి ఎన్నిక ప్రక్రియను పరిశీలిస్తే అనంతపురం జిల్లాలో సజావుగా జరుగగా, సత్యసాయి జిల్లాలో ఉద్రిక్తతల నడుమ నడిచాయి.

కంబదూరు ఎంపిపి లక్ష్మీదేవి

కణేకల్లు ఎంపిపి వండ్రయ్య

రొద్దం ఎంపిపి నాగమ్మ

రామగిరి, గాండ్లపెంటల్లో ఉద్రిక్తత

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి, గాండ్లపెంట ఎన్నికలు వాయిదా పడ్డాయి. రామగిరి మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక బుధవారమే జరగాల్సి ఉంది. అధికార టిడిపి, వైసిపి నేతల మధ్య ఈ ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారింది. అధికార టిడిపికి పూర్తి బలం లేకున్నా ఎంపిటిసిలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈనేపథ్యంలో విప్ జారీ చేసేందుకు వెళ్లిన ఇద్దరిపై దాడులు సైతం జరిగాయి. ఈ నేపథ్యంలో వైసిపి నాయకులు తమకు రక్షన కల్పించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఆశ్రయం కల్పించాలని ఆదేశాలిచ్చిన నేపథ్యంలో 144 సెక్షన్ విధించారు. రామగిరిలో పెద్దఎత్తున టిడిపి శ్రేణులు గుమికూడి ఉన్నారన్న ఉద్దేశ్యంతో వైసిపి ఎంపిటిసి అభ్యర్థులు ఎన్నికకు వెళ్లలేదు. కోరం లేకపోవడంతో ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేశారు. తమ పార్టీకి చెందిన ఎంపిటిసిలకు రక్షణ కల్పించాలని కోరుతూ వైసిపి నాయకులు పెనుకొండలో నిరసనకు దిగారు. పోలీసు రక్షణ నడుమ రామగిరికి తీసుకెళ్లాలని కోరుతూ సత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షురాలు ఉషచరణ్ శ్రీ, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ బోయ గిరిజమ్మ తదితరులు పెనుకొండ పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. నిరసన సమయంలో టిడిపి శ్రేణులు కూడా అక్కడికి చేరుకోవడంతో పెద్దఎత్తున ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గాండ్లపెంటలో వైసిపికి పూర్తిబలమున్నప్పటికీ తమవైపు వారిని తిప్పుకునేందుకు అధికార టిడిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషచరణ్ శ్రీ ఆరోపించారు. అందుకే ఎన్నికను వాయిదా వేయించారని ఆరోపించారు. ఈ ఎన్నిక కూడా వాయిదా పడింది.

ఎంపిపిలుగా వైసిపి మద్దతుదారులు

కంబదూరు, కణేకల్లు, రొద్దం మండలాలకు జరిగిన ఎంపిపి ఎన్నికల్లో వైసిపి మద్దతుదారులు ఎన్నికయ్యారు. **కంబదూరు** ఎంపిపి ఎన్నికను మండల పరిషత్ భవనంలో గురువారం నిర్వహించారు. వైసిపికి చెందిన రాళ్ల అనంతపురం ఎంపిటిసి లక్ష్మిదేవమ్మను సభ్యులు ఏగ్రీవంగా ఎన్నిక చేశారు. ఎన్నిక అనంతరం కళ్యాణదుర్గం వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య మాట్లాడుతూ మండలంలో వైసిపి శ్రేణులు సాధించిన సమిష్టి విజయం అన్నారు. **కణేకల్లు** ఎంపిపిగా వైసిపి మద్దతుదారుడు గరుడచేడు హరిజన వండ్రయ్య ఎన్నికయ్యారు. ఎంపిపిగా వండ్రయ్య ఒక్కరే పోటీలో నిలవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలియజేశారు. **రొద్దం** మండల ఎంపిపిగా వైసిపి మద్దతుదారురాలు నాగమ్మ ఏగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్లూరు ఎంపీటీసీ నాగమ్మను ఎంపిపిగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైస్ ఎంపిపిల ఎన్నిక ప్రశాంతం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు స్థానాలకు జరిగిన వైస్ ఎంపిపి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. **ఉరవకొండ** మండల పరిషత్ వైస్ ఎంపీపీగా పట్టణానికి చెందిన పదో ప్రాదేశిక సభ్యుడు ఈడిగ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ సభా భవనంలో వైస్ ఎంపీపీ కోసం ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా కుష్బు కొఠారి వ్యవహరించారు. ఈడిగ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించి ధ్రువపత్రాన్ని అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. **పెద్దపప్పూరు** మండల వైస్ ఎంపీపీ-2గా పసులూరు ఎంపీటీసీ వరదమ్మ గారి నాగవేణి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఈమె ఎన్నిక అనంతరం ఎన్నికల అధికారి ప్రభాకర్ రెడ్డి, ప్రిసైడింగ్ ఆఫీసర్, ఎంపీడీవో శకుంతలమ్మలు ఎన్నిక ధ్రువపత్రాన్ని అందజేశారు. **రాయదుర్గం** మండల ఉపాధ్యక్షుడి ఎన్నికను డిఆర్వో రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల అధికారి శ్రీనివాస్ యాదవ్, ఎంపీడీవో కొండన్న, వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియను కొనసాగించారు. సమావేశానికి పది మంది వైసిపి ఎంపిటిసిలు హాజరయ్యారు. వైస్ ఎంపీపీగా అరుణ్ కుమార్‌ను జుంజురంపల్లి ఎంపీటీసీ సురేష్ ప్రతిపాదించగా బిఎన్.హళ్లి ఎంపీటీసీ లక్ష్మి బలపరిచారు. పోటీ లేకపోవడంతో అరుణ్ కుమార్‌ను వైస్ ఎంపీపీగా ప్రకటిస్తూ ఎన్నికల అధికారి డిక్లరేషన్ అందజేశారు. **యల్లనూరు** మండలం వైస్ ఎంపిపిగా తిమ్మంపల్లి ఎంపిటిసి పి.రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. మండలంలో 10మంది ఎంపిటిసిలు స్థానాలు ఉండగా వైస్ ఎంపిపి ఎన్నికకు 7 మంది హాజరయ్యారు. ఏడుగురూ పి.రమాదేవిని వైస్ ఎంపిపిగా బలపరిచడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి రఘునాథ్ రెడ్డి ఆమెకు డిక్లరేషన్ అందజేశారు.

ఉపసర్పంచిల ఎన్నిక ఏకగ్రీవమే..!

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా జరిగిన నాలుగు ఉపసర్పంచి ఎన్నికలూ ఏకగ్రీవం అయ్యాయి. ఇందులో **పామిడి** మండల పరిధిలోని రామగిరి ఉపసర్పంచికు నిర్వహించిన ఎన్నికలో టిడిపి మద్దతుతో బోయ లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. **వజ్రకరూరు** మండలం కొనకొండ్ల ఉపసర్పంచి స్థానానికి చిన్నలింగప్పగారి హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. **మడకశిర** మండలం కళుమర్రి వైస్ సర్పంచిగా టిడిపి మద్దతుదారుడు కెపి.నరసన్న ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. **పెనుకొండ** మండలం రాంపురం ఉపసర్పంచిగా టిడిపి మద్దతుదారుడు నాగప్ప ఎగ్రీవంగా ఎన్నిక అయ్యారు.

పెనుకొండలో రామగిరి రచ్చ

- ఎంపిటిసిల కోసం టిడిపి, వైసిపి మధ్య ఘర్షణ
- తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి-పెనుకొండ

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి ఎంపిపి ఎన్నిక పెనుకొండలో రచ్చలేపింది. తహశీల్దార్ కార్యాలయం కేంద్రంగా టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య ఘర్షణ చోటు చేసుకుని ఉద్రిక్తతలకు దారితీసింది. రామగిరి ఎంపిపి ఎన్నికను అధికారులు గురువారం నాడు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 6 మంది ఎంపీటీసీలను కిడ్నాప్ చేశారంటూ రామగిరి పోలీస్ స్టేషన్లో వారి కుటుంబ సభ్యులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో ఎంపీటీసీలను ఎవరూ కిడ్నాప్ చేయలేదని తమ వద్ద ఉన్నారని పేర్కొని వైసిపి నాయకులు పెనుకొండ తహశీల్దార్ శ్రీధర్ వద్ద గురువారం ఉదయం హాజరుపరిచారు. ఇదే సమయంలో రామగిరి టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. టిడిపి, వైసిపి శ్రేణులు కార్యాలయంలోకి రావడంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిఐలు, ఎస్ఐలు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ఏర్పాట్లు చేశారు.


ఎంపిడిఓ కార్యాలయంలోకి వెళ్తున్న ప్రకాష్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

టిడిపి వెంట ఒక ఎంపిటిసి

ఎంపిటిసిలను తమతో తీసుకెళ్లేందుకు తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి, వైసిపి నాయకుల బుజ్జగింపుల పర్వం చాలా సేపు కొనసాగింది. 6 మంది ఎంపీటీసీలలో ఐదు మంది మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వెంట వెళ్లారు. ఒక ఎంపీటీసీ మాత్రం తెలుగుదేశం పార్టీ నాయకుల వెంట వారి వాహనాల్లో వెళ్లారు.

పెనుకొండ పోలీసు స్టేషన్ వద్ద వైసిపి నాయకుల నిరసన

ఎంపీటీసీలను బుజ్జగించిన టిడిపి నాయకులు

పెనుకొండ తహశీల్దార్ కార్యాలయం కేంద్రంగా రామగిరి ఎంపీటీసీలు 6 మందిని ఆ మండలం తెలుగుదేశం నాయకులు చాలాసేపు బుజ్జగించారు. తమతో రావాలంటూ వారిని కోరారు. ఇదే సమయంలో ఆరు మందిలో ఎవరూ వారి వెంట వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. తమ పార్టీ ఎంపిటిసిలను టిడిపి నాయకులు బలవంత పెడుతున్నారని ఆరోపిస్తూ కార్యాలయం బయట ఉన్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అతని అనుచరులు తలుపులుతోసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు బలవంతంగా వారిని అడ్డుకున్నారు. ఓ వైపు పోలీసులు పరిస్థితిని చక్కదిద్దుతున్నా తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి, వైసిపి నాయకులు ఒకరిపై ఒకరు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు.

పోలీసులపై వైసిపి నాయకుల ఆగ్రహం

తమ ఎంపిటిసిలను బలవంతంగా తెలుగుదేశం నాయకులు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. పోలీసులే తెలుగుదేశం నాయకులు సహకరించి వారికి వత్తాసు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. తహశీల్దార్ కార్యాలయంలోకి తమను ఎందుకు పంపరంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలో వైసిపి నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు తెలుగుదేశం కండువాలు వేసుకున్నారంటూ ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ రోడ్డుపై బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు దగ్గరుండి తెలుగుదేశం నాయకులకు సహకరిస్తున్నారని ఆరోపించారు.

సెమినార్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న విసి అనిత, తదితరులు

గిరిజనులకు అండగా నిలుద్దాం

ఎస్కేయు ఇన్‌ఛార్జి విసి అనిత

ప్రజాశక్తి -అనంతపురం

ప్రభుత్వాలు గిరిజనులను అన్ని విధాలా ఆదుకోవాలని, వారి అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య బి.అనిత కోరారు. ఎస్‌కెయు, సెంటర్ ఫర్ సోషల్ ఇంక్లూజన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సుల్లో భాగంగా గురువారం 'గిరిజన సమూహాల సామాజిక, ఆర్థిక, సాధికారిక అవకాశాలు-సవాళ్లు' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విసి మాట్లాడుతూ దేశంలో గిరిజనులు 8.6 శాతం ఉన్నారని, వారికి సరైన విద్య, ఉపాధి అవకాశాలు లేక, సమాజానికి దూరంగా నెట్టివేయబడటం ద్వారా కనీసం సరైన ఆహారం, వైద్యం అందక దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. వారిలో సామాజిక, ఆర్థిక, పరివర్తన తీసుకురావడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.కృష్ణకుమారి మాట్లాడుతూ గిరిజన తెగలకు సైకాలజికల్ ఎంపవర్‌మెంట్ అందించాలన్నారు. ఎస్‌కెయు రిజిస్ట్రార్ డాక్టర్ ఈ.రమేష్‌బాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్ ఛేంజ్ సెంటర్ ప్రొఫెసర్ కె.కృష్ణరాజ్ మాట్లాడుతూ గిరిజనుల స్థితిగతులు, వారి కోసం దేశ, విదేశాల్లో ఆయా ప్రభుత్వాలు చేపడుతున్న పథకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆచార్య బాబయ్య మాట్లాడుతూ సాంకేతిక టెక్నాలజీ గిరిజన ప్రాంతాలకూ అందించాలని, అప్పుడే వారి జీవితాల్లో వెలుగులు నింపుతాయన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.మునినారాయణప్ప మాట్లాడుతూ జాతీయ సదస్సు ముఖ్య ఉద్దేశాలను వివరించారు. సెమినార్ పుస్తకాలను విసి అనిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.వెంకటరెడ్డి, డి.శ్రీనివాసరావు, సిబ్బంది టి.కృష్ణారెడ్డి, ప్రశాంత్, డాక్టర్ కొండారెడ్డి, పద్మావతి, నర్మద, వరలక్ష్మి, పరిశోధన విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) సెంట్రల్ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు, విద్యార్థులకు గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరై విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధు, పరమేష్, సెంట్రల్ యూనివర్సిటీ యూనిట్ కమిటీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

తాడిపత్రిని మరింత అభివృద్ధి చేసుకుందాం

మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

జిల్లాలోనే తాడిపత్రి అభివృద్ధి చెందిన ప్రాంతమని, మరింత అభివృద్ధి చేసేందుకు పట్టణ ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో గురువారం అత్యవసర సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. 14 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తూ కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది. ముందుగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మున్సిపల్ కార్మికురాలికి సంతాపం తెలిపారు. భగత్‌సింగ్‌నగర్‌లో నిరాశ్రయులకు ఆశ్రయం ఇస్తున్న నైట్ షెల్టర్ మరమ్మతులకు రూ. లక్ష లు కేటాయించారు. ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి మాట్లాడుతూ మంగళగిరి మున్సిపాలిటీకి కేటాయించిన నిధుల్లో కొంత తాడిపత్రికి కేటాయించాలని మంత్రి నారా లోకేష్‌ను కోరినట్లు తెలిపారు. తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఛైర్మన్ జెసి మాట్లాడుతూ అండర్ డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. వార్డుల్లో చెత్త సేకరణకు 36 వాహనాలు ఏర్పాటు చేస్తామని, ఆ వ్యర్థాలతో వచ్చే ఆదాయంలో వాహన నిర్వాహకునికి కేటాయిస్తామన్నారు. కౌన్సిలర్ల అభ్యర్థన మేరకు వైసిపి నాయకులు ఫయాజ్‌బాషా చేపట్టిన నిర్మాణానికి సంబంధించి 9 మందితో కమిటీ వేసి నెలలోపు పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని సూచించారు.

కమిషనర్ తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం

కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-గుంతకల్లు

మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పనితీరుపై అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఫైళ్లు కదిలించేందుకు కమీషన్లు తీసుకోవడంలో ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై, పారిశుధ్యం నిర్వహణలో లేదని ధ్వజమెత్తారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో గురువారం ఛైర్‌పర్సన్ భవాని అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. టిడిపి కౌన్సిలర్ కృపాకర్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సరఫరా కోసం ఖర్చు చేస్తున్న నిధులకు లెక్కలు చెప్పడం లేదని, వీధి కుక్కల బెడదపై కనీస స్పందన లేదన్నారు. వైసిపి కౌన్సిలర్ల వార్డులకు తాగునీటి ట్యాంకులు పంపాలని కమిషనర్, ఇంజినీర్‌ను సంప్రదిస్తే డబ్బులు చెల్లించాలని చెప్పడం తగదని వైసిపి కౌన్సిలర్ లింగన్న, తదితరులు అసహనం వ్యక్తం చేశారు. వైస్ ఛైర్‌పర్సన్లు మైమూన్, నైరుతిరెడ్డి మాట్లాడుతూ మహిళా కౌన్సిలర్లు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ అసమర్థతతో పట్టణం దుర్గంధభరితంగా మారిందన్నారు. కౌన్సిల్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పనప్పుడు సమావేశాలకు రావడం దండగని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమె బాయ్ కాట్ చేయడంతో వైసిపి కౌన్సిలర్ కూడా సమావేశం నుంచి వెళ్లిపోయారు. కమిషనర్ తీరు మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కో ఆప్షన్ సభ్యులు రాజశేఖర్, మహబూబ్‌బాషా హెచ్చరించారు. సమావేశంలో టిడిపి, వైకాపా,సీపీఐ కౌన్సిలర్లు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెన్నపూసపల్లిలో గ్రామసభ

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని వెన్నపూసపల్లి గ్రామంలో ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నాడు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు కక్షలకు దూరంగా జీవనం సాగించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూసార పరీక్షలతో ఉపయోగం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులను వాడితే పంటల దిగుబడులు ఆశించిన మేర సాధించవచ్చని భూసార పరీక్షల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ రోజా పుష్పలత తెలిపారు. గురువారం మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రైతులందరు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చే భూసారపరీక్ష పత్రాన్ని తీసుకోవాలని తెలియజేసారు. అనంతరం పలువురు రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయధికారి శ్యాంసుందర్, ఉద్యాన సహాయకురాలు నవ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కందుకూరు రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ అధికారి జె.శశికళ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలోనూ రోజాపుష్పలత పాల్గొన్నారు. మట్టి నమూనాల సేకరణ, పోషకాల ఆవశ్యకత తదితర వాటి గురించి ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి మురళీకృష్ణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది నవనీత, అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : భూసార పరీక్షలు, ఎరువుల వాడకంపై గురువారం మండలంలోని తలుపూరు గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌టిఎల్ ఎడిఎ రోజాపుష్పలత, ఏవో సుచరిత, ఎఇఒ సుజిత మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులు వాడాలని సూచిం చారు. అలాగే సాయిల్ హెల్త్ కార్డ్స్ పంపిణీ చేశారు. వాటి ఆధారంగా ఎరువులను ఎలా వినియోగిం చుకోవాలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఏటా ఖరీఫ్‌లో ఏప్రిల్, మే నెలల్లో మట్టి పరీక్షలు నిర్వహిస్తారని, చేయించుకోవాల్సిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

చెన్నంపల్లి గ్రామంలో భూసార పరీక్ష పత్రాలను అందిస్తున్న రోజా పుష్పలత

కియా మోటార్స్‌తో పాలిటెక్నిక్ కళాశాల ఎంఒయు

ఉరవకొండ : మండలంలోని చిన్న ముష్టూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో కియా మోటార్స్ సంస్థ ఎంఒయు చేసుకుంది. ఈ మేరకు ప్రిన్సిపల్ అష్రఫ్‌అలీ, కియా కంపెనీ ప్రతినిధులు యోన్గిల్‌మా, సిఎస్ఆర్ అధికార ప్రతినిధులు జి.రవిశంకర్‌రెడ్డి, పి.వీరేంద్ర గురువారం కళాశాలలో ఎంఒయు పత్రాలు పరస్పరం ఇచ్చుకున్నారు. ఎంఒయు ప్రకారం కియా సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీం కింద రూ. 40 లక్షల విలువైన ప్రయోగశాల పరికరాలు, యంత్రాలను పాలిటెక్నిక్ కళాశాలకు అందజేయాల్సి ఉంటుంది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మంత్రి పయ్యావుల కేశవ్ కృషి వల్లే కియాతో ఎంఒయు కుదిరిందన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఈ విభాగాధిపతి వై.సురేష్ బాబు, జనరల్ సెక్షన్ శాఖాధిపతులు డాక్టర్ వి.నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు వాయిదా

బ్రహ్మసముద్రం : స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష ఏప్రిల్ 6వ తేదీ జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల ఏప్రిల్ 13వ తేదీకి మార్చినట్లు ప్రిన్సిపల్ సౌభాగ్యలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి 30 నిముషాలు ముందుగా చేరుకోవాలని, హాల్‌టికెట్‌లో ఫొటో తప్పుగా ప్రింట్ అయిన విద్యార్థులు ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి-రాయదుర్గం

తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ గురువారం పట్టణంలోని 22వ వార్డు ప్రజలు రోడ్డెక్కారు. హరిజనవాడ మహిళలు ఖాళీ బిందెలతో పట్టణంలోని బెంగళూరు రోడ్డుపై రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ హరిజనవాడలో తాగునీటి ఎద్దడి తీవ్రమందని, వారం పది రోజులకోసారి కూడా నీరు సరఫరా చేయడం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపినా ప్రయోజనం లేదన్నారు. కూలి పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారమని, నీరు కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రతాప్, సిబ్బంది అక్కడికి చేరుకుని తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకూ ట్యాంకర్లతో నీటి సరఫరా చేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

రీసర్వేపై గ్రామసభలు

గుంతకల్లు రూరల్ : భూరీసర్వే ఫేజ్-2లో భాగంగా గురువారం మండలంలోని దోసలుడికి, ధోనిముక్కల గ్రామాల్లో తహశీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. భూమి రీసర్వే చేయడం ద్వారా కలిగే లాభాలు, ప్రయోజనాలను ఆమె ప్రజలకు వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు : జెసి

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అధికారులను హెచ్చరించారు. జెసి గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ప్రజలు ఎండలో ఉండడం గమనించి వారికి నీడ ఏర్పాటు చేయడంతో పాటు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేయాలని తహశీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు. కాగా సమస్యల పరిష్కారంలో అధికా రులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కొందరు రైతులు ఫిర్యాదు చేశారు. పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తున్నారని ఓ పాత్రికేయుడు తెలిపారు. ఆయన వెంట డిటి తిప్పేస్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోతన్న, వీఆర్వోలు అజిత్‌కుమార్, శ్రీనివాసులు, నాగరాజు, రాజశేఖర్ ఉన్నారు.

'అనంత' విద్యార్థినికి అమెరికాలో మెడిసిన్ సీటు

ప్రజాశక్తి-అనంతపురం

నగరానికి చెందిన డాక్టర్ సుబ్రహ్మణ్యం, సి.వెంకటనారాయణమ్మ దంపతుల కుమార్తె చుండూరు లోహితాస్య అమెరికాలో మెడిసిన్ సీటు సాధించింది. ఆమె అమెరికాలోని ప్రతిష్ఠాత్మక ఓక్లహోమా విశ్వవిద్యా లయంలో ఎండి ఇంటర్నల్ మెడిసిన్ విభాగంలో పీజీ సీటు సాధించారు. వివిధ దశల్లో నిర్వహించే మెడికల్ లైసెన్సింగ్ ప్రవేశ పరీక్షలు, ఇంటర్వ్యూలో ఆమె అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి ప్రయత్నంలోనే సీటు సాధించారు. ఆమె నెలకు 7 వేల డాలర్స్ పారితోషికం అందుకోనున్నారు. ఆమె తండ్రి పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా, తల్లి కర్నూలు జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.పార్థసారథిచౌదరి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.పార్థసారథిచౌదరి ఎన్నికయ్యారు. పట్టణం లోని కోర్టు ఆవరణలో గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి జి.పార్థసారథిచౌదరి, హరిచక్రవర్తి పోటీపడ్డారు. బార్ అసోసియేషన్‌లో మొత్తం 46 మంది న్యాయవాదులు ఉండగా పోలింగ్‌లో 37 మంది పాల్గొన్నారు. జి.పార్థసారథిచౌదరి 9 ఓట్ల ఆధిక్యంతో అధ్యక్ష డిగా విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ఎర్రిస్వామి, సంపత్‌కుమార్ ప్రకటించారు. పార్థసారథిచౌదరికి 23 ఓట్లు రాగా, హరి చక్రవర్తికి 14 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యక్షుడిగా టి.రామాంజనేయులు, కార్యదర్శిగా కె.శ్రీనివాసులు, కోశాధికారిగా బి.తిప్పేస్వామి, సహాయ కార్యదర్శిగా డి.హనుమంతరాయుడు, మహిళా ప్రతినిధిగా పి.శ్రీలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు పార్థసారథిచౌదరి మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఉద్యమం తప్పదు

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, సిఐటియు పట్టణ కార్యదర్శి మల్లికార్జున హెచ్చరించారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం రాము అధ్యక్షతన పారిశుధ్య ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులతో సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా తాడిపత్రిలో ఇటీవల మృతిచెందిన ధనలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మున్సిపల్ కార్మికుల సమస్యలు, డిమాండ్లపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు రాసిన లేఖలను ప్రదర్శించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ విధానం రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 12వ పిఆర్‌సి అమలు చేయాలని, జిపిఎఫ్ అకౌంట్లు ఓపెన్ చేయాలని, బకాయి డిఎలు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, అదనపు కార్మికులకు రూ. 15వేల వేతనం, ఈపిఎఫ్ ఈఎస్‌ఐ అమలు చేయాలని, పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, అనారోగ్యంతో మరణించిన కార్మికుల కుటుంబా ల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని, గత ప్రభుత్వంలో పెండింగ్ లో ఉన్న జీవోలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని కమిషనర్లు జోక్యం చేసుకొని మధ్యాహ్నం పని మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మల్లేష్, సహాయ కార్యదర్శులు తిప్పేస్వామి, ఇంజినీరింగ్ విభాగం నాయకులు తిప్పేరుద్ర, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణకు రాసిన లేఖలను చూపుతున్న మున్సిపల్‌కార్మికులు

నేరాలు ఘోరాలు

దోపిడీ దొంగల హల్‌చల్.. రూ. 3.7 లక్షల చోరీ

ఉరవకొండ : మండలంలో బుధవారం అర్ధరాత్రి దోపిడీ దొంగలు హల్‌చల్ చేశారు. ముఖానికి మాస్కులు ధరించి, రాడ్లు, కత్తులతో తెల్లటి వాహనంలో వచ్చిన దోపిడీ దొంగలు అమిద్యాల హెచ్‌పి పెట్రోల్ బంకు, వజ్రకరూరులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో సిబ్బందిని బెదిరించి, కొట్టి పెట్రోల్ రూ. 3.7 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. అమిద్యాల బంకులో సీసీ కెమెరాలు పగలగొట్టి హార్డ్ డిస్క్ తీసుకెళ్లారు. వజ్రకరూరు పెట్రోల్ బంకులో చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్పెషల్ ఆపరేషన్ టీం, క్లూస్ టీం ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

అదుపుతప్పి బైక్ బోల్తా.. ఒకరు మృతి

డి.హీరేహాళ్ : ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని అలకుంది గ్రామానికి చెందిన ఎర్రిస్వామి (36), బసవ ద్విచక్ర వాహనంపై డి.హీరేహాళ్ వైపు నుంచి స్వగ్రామం వెళుతుండగా ఎన్‌హెచ్-150ఎ రోడ్డుపై అదుపుతప్పి బ్రిడ్జి పక్కన ఉన్న సుమారు 10 అడుగుల కిందకు పడిపోయారు. ఈ సంఘటనలో ఎర్రిస్వామి మృతి చెందాడు. బసవ తీవ్రంగా గాయపడగా బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎర్రిస్వామి గొర్రెల వ్యాపారి. ఇతడికి ఓ కొడుకు, కూతురు సంతానం ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

రాయదుర్గం రూరల్ : మండలంలోని టి.వీరాపురం గ్రామంలో ఈ నెల 25వ తేదీ జరిగిన సుంకప్ప హత్య కేసులో నిందితుడు వన్నూరుస్వామిని గురువారం కుంటు మారెమ్మ ఆలయం వద్ద అరెస్ట్ చేసినట్లు అర్బన్ సిఐ జయానాయక్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు.. గుమ్మఘట్ట మండలంలోని రంగచేడు గ్రామంలో సుంకప్పకు రెండెకరాల తోట ఉంది. దానిని తన పేరిట చేయాలని కొడుకు వన్నూరుస్వామి తండ్రి సుంకప్పతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో తనకు ఆస్తి ఇవ్వలేదనే కోపంతో ఇంట్లో నిద్రిస్తున్న సుంకప్పను వన్నూరుస్వామి కొడవలితో నరికాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని వన్నూరుస్వామిని అరెస్ట్ చేసి, కొడవలి స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వివరించారు.

మడ్డిపల్లిలో మహిళ మృతదేహానికి రీపోస్టుమార్టం

పుట్లూరు : మండలంలోని మడ్డిపల్లి గ్రామానికి చెందిన రమణారెడ్డి భార్య వినోదినిదేవి 3 నెలల క్రితం హైదరాబాద్‌లో మృతిచెందగా మృతదేహాన్ని మడ్డిపల్లికి తీసుకొచ్చి పూడ్చారు. అయితే ఆమె మృతిపై ఆమె అన్న అనిల్‌కుమార్ తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కోర్టు ఉత్తర్వుల మేరకు గురువారం తాడేపల్లి ఎస్ఐ, డాక్టర్లు, తహశీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో మహిళ మృతదేహాన్ని బయటకు తీసి రీ పోస్టుమార్టం నిర్వహించారు.

ధ్వంసమైన పైప్‌లైన్ పరిశీలన

నార్పల : మండలంలోని పులసలనూతల గ్రామంలో తాగునీటి బోరుకు పైపులు, కేబుల్ వైర్లు, స్టార్టర్లను దుండగులు ధ్వంసం చేయడంతో గురువారం ఎంపిడిఒ గంగావతి, ఈవోఆర్‌డి శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ జనార్దన్, టిడిపి నాయకులు ఆకుల విజయ్ కుమార్ పరిశీలించారు. వీటిని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. వారి వెంట మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్యామల, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చంద్రబాబు, రంజిత్, రామేశ్వరి, ప్రత్యూష ఉన్నారు.

రోడ్డు విస్తరణ పేరుతో కక్ష సాధింపులు తగదు : మెట్టు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

రోడ్డు విస్తరణ పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం తగదని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో గురువారం మెట్టు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బళ్లారి నుంచి గుండ్లపల్లి క్రాస్ వరకూ రోడ్డు విస్తరణను వైసిపి స్వాగతిస్తుందన్నారు. ఉద్దేహాల్ గ్రామంలో సుమారు 250 గృహాలు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్నాయని, అయితే ఆర్ అండ్ బి రోడ్డు సమీపంలో భవనం నిర్మించాడని, రేకుల షెడ్డు వేశారని కేవలం రాజ్‌కుమార్ ఒక్కడికే నోటీసులు ఇవ్వడం కక్ష సాధింపు ధోరణి కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం అందరినీ సమానంగా చూస్తూ ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైసిపి శ్రేణులపై బనాయించిన అక్రమ కేసులను చట్టపరంగా ఎదుర్కొంటామన్నారు. అంతకు ముందు ఆయన వైసిపి మండల కన్వీనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో రాజ్‌కుమార్ ఇంటి వద్ద నుంచి సినిమా థియేటర్ వరకూ ర్యాలీగా వెళ్లి రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో నేమకల్లు సర్పంచి పరమేశ్వర, ఉంతకల్లు సర్పంచి ముక్కన్న, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని పంపనూరు గ్రామంలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ముఖద్వారాన్ని గురువారం ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. అనంతరం ఆమె సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఎయిర్ కూలర్స్, చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆలయ ఈఓ బి.బాబు, సేవా సమితి సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ అతి త్వరలో ఆలయ అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే

అనంతపురం రూరల్ : నగర శివారులోని అనంతపురం-కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న సెయింట్ ఆన్స్ స్కూల్ దగ్గర నుంచి తలుపూరు గ్రామం వరకు రూ. 1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన బిటి, సీసీ రోడ్డును గురువారం ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారున. అనంతరం గ్రామంలోకి వెళ్లి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. గ్రామస్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

గుత్తిలో ఫంక్షన్ హాల్ సీజ్

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉన్న వసుధ ఫంక్షన్ హాల్‌ను గురువారం మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. ఎస్ఎస్.పల్లికి చెందిన జిబి.నాగరాజు వక్ఫ్ బోర్డు స్థలాన్ని లీజుకు తీసుకొని వసుధ ఫంక్షన్ హాల్‌ను నిర్మించి సమావేశాలు, శుభకార్యాలకు అద్దెకు ఇచ్చేవాడు. 2019 నుంచి 2025 వరకు ఆస్తి పన్ను రూ. 5,22,978 చెల్లించాల్సి ఉంది. పన్ను చెల్లించాలని మున్సిపల్ అధికారులు పలుమార్లు యజమానికి రెడ్ నోటీసులు పంపినా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. దీంతో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, వివిధ విభాగాల అధికారులు వెళ్లి వసుధ ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పి.రాంబాబు, రెవెన్యూ అధికారి సతీష్‌కమలాకర్, ఆర్ఐ షేక్షావలి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, హెల్త్ అసిస్టెంట్ నెట్టికల్లు, రామరాజ్యలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు ఫయాజ్ అహ్మద్, బాబా ఫకృద్దీన్, ఆనంద్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అరాచకపాలన

మాజీ ఎమ్మెల్యే విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అరాచక పాలన సాగిస్తుందని, పోలీసులను అడ్డు పెట్టుకుని ప్రతిపక్షాలు, మేధావులు, జర్నలిస్టులను తమ చెప్పుచేతల్లో పెట్టుకోవాలని చూస్తోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడా టిడిపికి మెజార్టీ సభ్యులు లేకున్నా వైసిపి జడ్పిటీసీలు, ఎంపిటీసీలను బెదిరించి పదవులను కైవసం చేసుకోవాలని చూస్తుందని విమర్శించారు. నియోజవర్గంలో మంత్రి పయ్యావుల కేశవ్ వైసిపి నేతలను పోలీసుల ద్వారా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తాము తీవ్రంగా ప్రతిఘటించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం వైస్ ఎంపిపీగా ఈడిగ ప్రసాద్, విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానించారు.

రేపు టిడిపి ఆవిర్భావ దినోత్సవం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 29వ తేదీ టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని 50 డివిజన్లు, 4 పంచాయతీల్లో పార్టీ జెండా రెపరెపలాడాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విదేశాల్లో ఉన్న ఎమ్మెల్యే గురువారం ఫోన్ ద్వారా అర్బన్‌లోని పార్టీ ముఖ్య నేతలతో ఫోన్‌లో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహిస్తున్న తొలి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. 50 డివిజన్లు, 4 పంచాయతీల నాయకులు ఈ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ప్రతి చోటా టిడిపి జెండా ఎగురవేయాలన్నారు. కార్యకర్త నుంచి ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఆవిర్భావ దినోత్సవం రోజున నిర్వహించే కార్యక్రమాల్లో అనంతపురం అర్బన్ నియోజవర్గం రాష్ట్రంలోనే హైలెట్‌గా నిలవాలని ఎమ్మెల్యే నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

దుస్తులు పంపిణీ

అనంతపురం : సతామి సందర్భంగా గురువారం నగరంలోని సాయినగర్‌లో ఉన్న డాక్టర్ అక్బర్ కంటి ఆసుపత్రిలో డాక్టర్ అక్బర్ సాహెబ్ దాదాపు వంద పేద ముస్లిం మహిళలు, పురుషులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తమకు తోచినంత సహాయం చేయటం మానవ ధర్మమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అక్బర్ ఐ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ అక్బర్

'ప్రభుత్వ ఇఫ్తార్‌ను బహిష్కరిస్తున్నాం'

అనంతపురం : వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు నిరసనగా ఈ నెల 28వ తేదీ నగరంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందును బహిష్కరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ విభాగం వైసిపి అధ్యక్షులు మొఘల్ సైపుల్లా బేగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాల ఇఫ్తార్‌లను మైనార్టీలు బహిష్కరించాలని ఆయన సూచించారు. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అనంతపురంలో ఇచ్చే ఇఫ్తార్‌ను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి ముస్లింలపై ప్రేమ చూపిస్తూ, మరోపక్క బిజెపి ప్రవేశపెట్టిన ముస్లిం నల్ల చట్టాలకు జైకొట్టడం సబబు కాదన్నారు. సిఎం చంద్రబాబు వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం కాకుండా తిరస్కరించాలని, రాష్ట్ర శాసనసభలో బిల్లును వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తులను అంబానీలకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్ర పన్నిందని ఆయన ఆరోపించారు.

చలివేంద్రాలు ప్రారంభం

ఉరవకొండ : వివిధ పనులపై వచ్చే ప్రజల దాహార్తి తీర్చడానికి పట్టణంలోని నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గురువారం సర్పంచి లలితమ్మ, టిడిపి నాయకులు ప్రారంభించారు. టౌన్ బ్యాంక్ సమీపంలోని చర్చి వద్ద, కాలేజీ గేటు వద్ద, గుంతకల్లు బస్ స్టాప్ వద్ద, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు ప్యారం కేశవ, పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

గుమ్మేపల్లిలో 'స్వచ్ఛ సంకల్ప' కళాజాత

శింగనమల : మండలంలోని గుమ్మేపల్లి గ్రామంలో ఆదివారం సర్పంచి దేగల లలితమ్మ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 'స్వచ్ఛ సంకల్ప' కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో గ్రామంలో పారిశుధ్యం, తడి చెత్త, పొడి చెత్త వేర్వురుగా నిర్వహణ, మొక్కల పెంపకం, నీటి పొదుపు, అంటు వ్యాధులు నివారణ, తదితర అంశాల పై ప్రజలకు కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి నాగరాజు, టిడిపి నాయకులు దేగల శ్రీనివాసులు, నారాయణస్వామి, ఓబుళపతి, ఓబయ్య, లక్ష్మన్న, క్రిష్ణమూర్తి, శివయ్య, మల్లికార్జున, బాల్‌రెడ్డి, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

రామ్ చరణ్ అభిమానుల రక్తదానం

అనంతపురం : సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా గురువారం రామ్ చరణ్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు ఇమామ్ హుస్సేన్ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీ బాలాజీ రెసిడెన్సీలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర చిరంజీవి యువత అధ్యక్షుడు భవానీ రవికుమార్ హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. శిబిరంలో 70 మంది మెగా అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు చలపతి, చంద్రమౌళి, సురేష్, శామీర్, షామీర్, శేషాద్రి, గిరి, రామంజి, వంశీ, చరణ్, కిషోర్, వెంకీ, సంపత్, వరుణ్, అంబేద్కర్ నగర్ నాగేంద్ర, సాయిచరణ్ పాల్గొన్నారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న రామ్‌చరణ్ అభిమానులు

ఫ్యాప్టో డిప్యూటీ జనరల్ సెక్రటరీగా నీలూరు రమణారెడ్డి

అనంతపురం : ఫ్యాప్టో డిప్యూటీ జనరల్ సెక్రటరీగా నీలూరు రమణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హృదయరాజు ఆధ్వర్యంలో ఫ్యాప్టో సమావేశం నిర్వహించారు. అందులో ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డిని ఫ్యాప్టో డిప్యూటీ జనరల్ సెక్రటరీగా నియమించారు. రెండేళ్లుగా ఫ్యాప్టో డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పని చేస్తున్న రమణారెడ్డిని మరోమారు ఎన్నిక చేయడం పట్ల జిల్లా సంఘం హర్షం వ్యక్తం చేసింది. తన ఎన్నికకు సహకరించిన ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర, జిల్లా, మండల ఎస్‌టియు నాయకులకు రమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై కార్యవర్గ సభ్యులతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. దీర్ఘకాలంగా జిల్లాలో కోర్టు కేసులతో ఆగిపోయిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల కోసం మొదట ప్రాధాన్యతగా కృషి చేస్తానని తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

గృహ నిర్మాణ శాఖ పీడీ శైలజ

పామిడి : పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ పిడి శైలజ లబ్ధిదారులకు దిశా నిర్దేశం చేశారు. ఆమె గురువారం స్థానిక అంబేద్కర్ కాలనీలో పర్యటించారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు 95 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 75వేలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మారుతీ , ఇంజనీరింగ్ అసిస్టెంట్ భరత్ మరియు హౌసింగ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైసిపి ఎన్‌ఆర్‌ఐ వింగ్ కోఆర్డినేటర్‌గా సాంబశివారెడ్డి

శింగనమల : వైసిపి ఎన్‌ఆర్‌ఐ వింగ్ కోఆర్డినేటర్‌గా ప్రభుత్వ మాజీ విద్యాసలహాదారు, నియోజకవర్గ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి నియమితులైనట్లు గురువారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన పార్టీ అధినేత వైఎస్.జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇది కేవలం హోదా మాత్రమే కాదు దేశ విదేశాల్లోని వైసిపి కుటుంబాన్ని కనెక్ట్ చేయడం, శక్తివంతం చేయడం, బలోపేతం చేయడం అన్నారు. వైసిపి ఎన్‌ఆర్‌ఐలు ఎప్పుడూ పార్టీకి మూలస్తంభం అన్నారు. ఇప్పుడు వారి గొంతును ఏపి హృదయానికి చేరువ చేయడం నా కర్తవ్యం అన్నారు.

వైసిపి చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పి.శివకుమార్

రాయదుర్గం : వైసిపి చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన పోరాలు శివకుమార్ నియమితులయ్యారు. పద్మశాలి చేనేత సామాజిక వర్గానికి చెందిన పోరాలు శివకుమార్ పట్టణంలోని 2వ వార్డు పార్టీ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. తనకు అవకాశం కల్పించిన వైసిపి అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

రాయదుర్గం : పట్టణంలో ఎక్కడైనా నీటి ఎద్దడి ఉంటే మున్సిపల్ ఇంజినీర్ల దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొలకల్మూర్ రోడ్డు, బిటిపి రోడ్డు, సిద్దేశ్వర కాలనీ, వెంకటేశ్వర మాన్యం, వాల్మీకి నగర్, కోతి గుట్ట పైతోట, ఎంసిఎ లేఅవుట్, జర్నలిస్ట్ కాలనీ, తదితర ప్రాంతాలు ఎత్తయిన ప్రదేశంలో ఉన్నందున నీటి సరఫరా తక్కువగా ఉంటుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తితే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామన్నారు. ఆ ప్రాంతాల్లో కొళాయి కనెక్షన్లు ఇస్తామని తెలిపారు. నీటి ఎద్దడిపై 79950 80752, 79950 80747 ఫిర్యాదు చేయాలని తెలిపారు.

నిరుపేదలకు భూమి ఇవ్వాలని వినతి

కళ్యాణదుర్గం రూరల్ : భూమి లేని నిరుపేదలకు భూమి ఇవ్వాలని కోరుతూ గురువారం ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప తహశీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కులాలకు అతీతంగా భూమి లేని నిరుపేదలను గుర్తించి మూడెకరాల చొప్పున వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గోవిందప్ప, దుర్గప్ప, చిన్న ఆంజనేయులున తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అనంతపురం : రూరల్ పరిధిలోని రాజీవ్‌కాలనీ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం సర్పంచి డి.ఆశాబి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమన్నారు. కార్యక్రమములో పంచాయితీ కార్యదర్శి కె.శ్రీధర్‌రావు, పిఆర్ అండ్ ఆర్‌డి విస్తరణ అధికారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కీర్తి మెడికల్స్ వార్షికోత్సవం

అనంతపురం : నగరంలోని సుభాష్ రోడ్డులో ఉన్న కీర్తి మెడికల్స్ మూడో వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కీర్తి మెడికల్స్ మేనేజర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ కీర్తి మెడికల్ ద్వారా ప్రజలకు నాణ్యమైన మందులను డిస్కౌంట్‌లో అందిస్తున్నామన్నారు. మూడేళ్లుగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ఆదరణ పొందామన్నారు. సంస్థ అభివృద్ధిలో సిబ్బంది శ్రమ కీలకమైందన్నారు. సిబ్బంది పురోగతి దృష్టిలో పెట్టుకొని కీర్తి సంస్థ సేవలందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బిల్డింగ్ ఓనర్ కొండయ్య, కీర్తి అసిస్టెంట్ మేనేజర్ పవన్, హరికృష్ణ, మార్కెటింగ్ మేనేజర్ అరుణ్, హెచ్‌ఆర్.రవి, సిబ్బంది పాల్గొన్నారు.

దినసరి కూరగాయల మార్కెట్ వేలం

రాయదుర్గం : మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి సమక్షంలో మార్కెట్ వేలం పాటలు నిర్వహించారు. దినసరి కూరగాయల మార్కెట్‌ను ఎన్.మల్లికార్జున రూ. 29,90,000లకు, వారపు సంతను ఆంజనే యులు రూ. 9,83,000లకు దక్కించుకున్నారు. జంతువధశాలకు వేలం పాట నిర్వహించగా ఎవరూ పాల్గొనక పోవడంతో ఈ నెల 28వ తేదీకి వాయిదా వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, రెవెన్యూ ఆఫీసర్ కొండన్న, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు హరిప్రసాద్, సత్యనారాయణ, వేలం పాటదారులు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియ తనిఖీ

నార్పల : స్థానిక రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ తనిఖీ చేశారు. మండలంలోని మొత్తం 12 రెవెన్యూ గ్రామాలకు గానూ 11,300 మందికి గానూ ఇప్పటివరకూ 3,450 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. మిగిలిన రైతులు కూడా వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. రైతు రిజిస్ట్రేషన్ నంబరు ఉంటేనే భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి పథకాలు, రాయితీలు అందుతాయన్నారు. ఆమె వెంట ఏవో చెన్నవీరస్వామి, ఎఇఒ రాము, రైతు సేవా కేంద్రం-1 వ్యవసాయ అధికారి అనూష, రైతులు ఉన్నారు.

తోపుడు బండ్ల వ్యాపారులకు నోటీసులు

నార్పల : స్థానిక గూగూడు రోడ్డులో సంత మార్కెట్ వద్ద రోడ్డుకు అడ్డంగా పండ్లు, పండ్ల రసాలు, కూరగాయలు, తదితర చిరు వ్యాపారాలు చేసే తోపుడుబండ్ల నిర్వాహకులకు గురువారం పంచాయతీ సిబ్బంది నోటీసులు అందజేశారు. ఇకపై రోడ్డుకు అడ్డంగా తోపుడు బండ్లు పెట్టరాదని, రోడ్డుపై ఉన్న దుకాణాలు తొలగించాలని సూచించారు. కొన్నిరోజులుగా నార్పలలో ట్రాఫిక్ సమస్య తీవ్రం కావడంతో పంచాయతీ అధికారులు ఈ చర్యలకు ఉపక్రమించారు.

సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

అనంతపురం : సాయి ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నగరంలోని అరవిందనగర్‌లో ఉన్న మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. హిందూ, ముస్లింల సఖ్యత, మత సామరస్యం కొరకు ఏర్పాటు చేస్తున్న సాయి ట్రస్ట్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయి కుమార్, సిబ్బంది నారాయణనాయక్, రాఘవేంద్ర, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

పుట్లూరు : మండల వ్యాప్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి అవకతవకలను గుర్తించారు. వాటిని గురువారం పుట్లూరులో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో పిడి సలీమ్‌బాషా, అడిషనల్ పిడి సుధాకర్‌రెడ్డి, ఎవివో పర్వీస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల వారీగా వినిపించారు. రూ. 4.5 లక్షలు దుర్వినియోగం జరిగిందని రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అలివేలమ్మ, ఎపిఒలు చెన్నకేశవ నాయుడు, భాగ్యలక్ష్మి, ఇన్‌ఛార్జి ఎపిఒ నరేంద్ర, ఇన్‌ఛార్జి ఇసి విజయనాగేంద్ర, టిఎలు, సిఒలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

పుట్లూరు : శింగనమల నియోజకవర్గ పరిధిలోని పేదలకు గురువారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ. 11,50,193 సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేదల ఆరోగ్యానికి భరోసా ఇవ్వడం హర్షణీయమన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే శ్రావణి

మహారాజశ్రీ అనంతపురం ప్రిన్సిపల్ జిల్లా జడ్జివారి కోర్టులో
E.P. No: 625/2024 in O.S. No: 22/2010

Between:
M/s మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ Rep by its Branch Manager, Kadapa ...**Decree Holder**
V/S
కె.వెంకటరమణ మరియు ఇతరులు ...**J.Drs**

J.Dr No:2:
టి.వెంకటసీతారామయ్య S/o టి.జగన్‌మోహన్‌రావు, వయస్సు 47 సంIIలు, M/s R.S.Fashions, D.No: 15/24, Raju Road, Ananthapuramu, Resinding at H.No:10/219, Upstairs, Adimurthy Nagar, Ananthapuramu.

J.Dr No:2 కి U/O 21 Rule 54 CPC Notice
పిటీషనరు/డిక్రీహోల్డర్ J.Dr No:2 మీపైన ఆస్తి జప్తునకు పై E.P.ని దాఖలు చేసివున్నారు.కనుక మీరు 10-04-2025వ తేదిన ఉదయం 10:30 గంIIలకు పై కోర్టులో స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఎటువంటి ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను.అట్లు లేని యెడల పై E.P.ని పరోక్షంగా తీర్మానించబడును.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
B.RAJASEKHAR,
D.Hr తరుపు అడ్వకేట్, అనంతపురం

BEFORE THE HON'BLE CHAIRMAN MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-1ST ADDITIONAL DISTRICT JUDGE AT: ADILABAD.
M.V.O.P.No. 201/2023

Between:-
Kumram Suryamani and others
....Petitioner/Petitioner
AND
Shaik Allabakash & others
...Respondents/ Respondents

To
Shaik Abdul Razak, S/o Late S.Jafar Sab, Age: 45 years, Occ: Owner of Lorry bearing No. AP-39-T-9567, R/o H.No. 19-1-91, Vinayaka Nagar, Anantapur, Dist: Anantapur (A.P) - 515 001.
(Respondent No.2)

Take notice, that the petitioner herein filed the above M.V.O.P. against of you for claiming compensation under M.V Act. notice was sent to your address but it was returned un-served and now the above case is posted on 29.04.2025 for your appearance. Hence you are hereby directed to appear before this Court on 29.04.2025 at about 10:30 A.M. in persons or through Advocate duly instructed to answer all material questions, otherwise the matter will be heard and decided exparte.

// BY ORDER OF THE COURT //
KENDRE RAMESH
Advocate, Adilabad Telangana State, Cell: 9440095619,

బహిరంగ ప్రకటన
కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము శ్రీ సంగమేశ్వరస్వామి దేవస్థానము, కూడేరు గ్రామము మరియు మండలం అనంతపురము జిల్లా.

పై దేవస్థానము నందు 2025 సంవత్సరము ఏప్రిల్ నెల యందు 06/04/2025 నుండి 15/04/2025 వరకు జరుగు బ్రహ్మోత్సవముల సందర్భముగా ఈ క్రింద తెలిపిన పనులకు గాను కొటేషన్లను ఆహ్వానించడమైనది. 1.సున్నంపూతలు, 2.విద్యుత్ దీపాలకంరణ, 3.చలువ పందిర్లు,4.ప్రింటింగు, 5.ఫ్లవర్ డెకరేషన్, 6.రథం రిపేరి, 7.పెయింటింగ్స్, 8.దేవాలయ పరిసర ప్రాంతాలు, పార్కింగ్ స్థలం, రథంతిరుగు రస్తా, రోడ్డుకు ఇరువైపుల వున్న ముళ్ళ చెట్లను తొలగించుట, జెసిబితో క్లీనింగు చేయుటకు, తదితర పనులకు ఆసక్తి గలవారు తమ కొటేషన్లను ఈ ప్రకటన వెలువడిన 5 రోజులలోగా పంపవలసినదిగా కోరడమైనది.

కార్యనిర్వహణాధికారి,
శ్రీ సంగమేశ్వరస్వామి దేవస్థానము, కూడేరు, అనంతపురం జిల్లా.